
గవర్నమెంట్ కథలు నెం-౨

# నేరం

కె.ఆర్.కె.మోహన్



కథా నిలయం
శ్రీకాకుళం

నగరంలో ఆర్టీసి బస్‌లు మామూలుగానే నడుస్తున్నాయి.

ఓ బస్‌లో కొందరు స్టూడెంట్స్ వెళుతున్నారు. వాళ్ళకీ కండక్టర్‌కీ ఏదో మాటా మాటా వచ్చి మాటల అధ్యాయం చేతల కాండకి మలుపు తిరిగింది.

స్టూడెంట్స్ పదిమందీ కలిపి కండక్టర్‌ని క్రిందికి లాగి కొట్టారు. ఈ వార్త నగరంలోని బస్ డ్రైవ

ళ్లందరికీ, వైర్లెస్‌కన్నా వేగంగా వెళ్ళి చేరింది. అంతే! ఎక్కడ బస్‌లు అక్కడ నిలిచిపోయాయి.

నాలుగు గంటలకి స్కూల్స్ వదిలిపెట్టారు. 'హొలో' మంటూ పిల్లలు బయటకి పరుగులెత్తుకుంటూ వచ్చారు. అలవాటుగా రిక్షాలమీద వచ్చే వాళ్ళు, వాళ్ళ కోసం వచ్చిన రిక్షాలలో వెళ్ళిపోయారు. కొద్దిమంది పెట్టి పుట్టిన వాళ్ళు—వాళ్ళ నాన్నలు, అన్నలు తెచ్చిన స్కూటర్లమీద ఇళ్ళకు వెళ్ళారు. దగ్గర ఇళ్ళున్న వాళ్ళు సంచులు భుజాన వేసుకొని నడుచుకుంటూ వెళ్ళారు. ఇంకా దూర ప్రాంతాలనుంచి బస్‌లమీద వచ్చే పిల్లలు మామూలుగా బస్ స్టాప్‌ల వద్ద చేరారు. పాలబుగ్గల పసిపిల్లలు గాడిదబరువులని మించిన పుస్తకాల బరువుతో, బస్‌లకోసం ఆతృతగా ఎదురుచూస్తూ నుంచున్నారు.

నగర జీవితం కృత్రిమంగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదనిపిస్తుంది. ఇక్కడ మధ్యతరగతి ప్రజలు కూడా గొప్పలకోసమో లేక తమ పిల్లలు చాలా గొప్పవారవ్వాలన్న ఆశతోనో, తమ పిల్లల్ని ఎంతో దూరానవున్న ఇంగ్లీష్‌కాన్వెంట్లకి పంపిస్తుంటారు.

ఐదయింది. ఆరయింది. ఒక్క బస్సూ రావడం లేదు. కారణం ఏమిటో పిల్లలకి అర్థం కావడంలేదు. వాళ్ళకి అంతకంతకీ ఆందోళన, భయం పెరిగిపోతున్నాయి. ఆ బస్ స్టాప్ దగ్గర సుమారు పదిమంది పిల్లలు నుంచున్నారు. వాళ్ళలో ఎవరికీ ఏడేళ్ళు మించి వయసులేదు. బస్‌లు రావడం లేదు. వారినీ వీరినీ అడగడం మొదలుపెట్టారు. బస్ వాళ్ళు స్ట్రయిక్ చేస్తున్నారనీ, ఆ రోజుకి ఇంక బస్‌లురావనీ చెప్పారు వాళ్ళు. స్ట్రయిక్ అంటే ఏమిటో అర్థంకాకపోయినా, బస్‌లు రావనే విషయం వాళ్ళకి అర్థమైంది. బస్‌లు రాకపోవడంతో - ఆటోలకీ, రిక్షాలకీ విపరీతమైన గిరాకీ ఏర్పడింది. అసలు అవి ఖాళీవే కనిపించడంలేదు.

మరో అరగంట అయ్యేసరికి, ఆ పదిమంది పిల్లల్లో కొంతమంది, కొంచెం చొరవా, ధైర్యం, చేతిలో డబ్బూ ఉన్న వాళ్ళు ఎలాగోలాగ అతి కష్టంమీద రిక్షా మాట్లాడుకొని తమ ఇళ్ళకు జట్లుగా కూర్చుని వెళ్ళిపోయారు. మరికొంతమందిని-వాళ్ళ బంధువులు వచ్చి తీసుకు వెళ్ళిపోయారు. చివరకి ఆరేళ్ళ పసిపాప మిగిలిపోయింది. సాటి పిల్లలు అందరూ వెళ్ళిపోయేసరికి ఆ చిన్నారికి విపరీతమైన భయం

వేసింది. ఒక ప్రక్కన చీకటి పడి పోతోంది. ఇంక తట్టుకోలేక పేవ్‌మెంట్ మీద కూర్చుని ఆ మోపెడు పుస్తకాలు ముందేసుకుని, బిగ్గరగా ఏడుపు మొదలు పెట్టింది.

ఇంతలో కార్పొరేషన్‌కి చెందిన రూట్ నంబర్ '44' బస్ వచ్చి ఆ స్టాప్ దగ్గర ఆగింది. స్ట్రైక్ చేస్తుంది ఆర్టీసి బస్‌లే కాని, కంపెనీల బస్‌లు, కార్పొరేషన్‌ల బస్‌లు కాదుగా! అవి మామూలుగానే వారి వారి ఉద్యోగులను ఇళ్ళకు జేరుస్తున్నాయి. ఆ స్టాప్ దగ్గర ఆ బస్ నుంచి పది మంది దాకా దిగారు. ఏడుస్తున్న ఆ పసి పాప ఆ డ్రైవర్ కంట బడింది. బస్ దిగి వెళ్ళి, "ఏం పాపా— ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగాడు లాలనగా.

"ఇవాళ బస్‌లు లేవటగా! నేనెలా ఇంటికి వెళ్ళను?" అంటూ మరింత బిగ్గరగా ఏడ్చింది ఆ పాప.

"అవును. ఈ రోజు బస్‌లు లేవు. మరి నిన్ను తీసుకెళ్ళడానికి మీ వాళ్ళెవరు రారా?"

"మా నాన్న ఊళ్ళో లేడు. అమ్మ ఒక్కతే ఉంది. ఇంకెవరూ లేరు."

"అయ్యో! మీ ఇల్లు ఎక్కడ?"

"మాదన్నపేట."

మాదన్నపేట ఆ బస్ రూట్ లోనే ఉంది. ఇంక వేరే ఏమీ ఆలోచించకుండా, అడగకుండా, "రా-పాపా! మా బస్ అటే వెళుతుంది. బస్ ఎక్కు" అన్నాడు డ్రైవర్.

"నాది పాస్. నా దగ్గర డబ్బులు లేవు" అంది ఆ పాప ఏడుస్తూనే.

"ఫర్వాలేదులే. ఇది కంపెనీ బస్. నువ్వేమీ డబ్బులియ్యక్కర్లేదు" అంటూ ఆ పాప చేతిని ఒక చేతిలో, పుస్తకాల సంచిని రెండో చేతిలో తీసుకొని బస్ ఎక్కించాడు డ్రైవర్.

బస్ తిరిగి ప్రయాణం ప్రారంభించింది. పాప ముఖం ఉత్సాహంతో కళ కళ లాడసాగింది.

రాజకీయాలు నీచ స్థాయికి దిగినప్పుడు, మానవత్వపు విలువలు మంటగలిసి పోతాయి. ఆ బస్‌లో ప్రయాణం చేస్తున్న వారిలో, ఆ కంపెనీకి చెందిన రెండు ప్రత్యర్థి యూనియన్‌ల సభ్యులు ఉన్నారు. ఒక యూనియన్‌కి చెందిన సభ్యునికి డ్రైవర్ చేసిన పని నచ్చలేదు. అందుకు కారణం అతను రెండో యూనియన్‌కి చెందిన వాడవడం.

"డ్రైవర్! ఇది కంపెనీ బస్. కంపెనీ ఉద్యోగుల కోసమే కాని

పబ్లిక్ కోసం కాదు. ఆ పిల్లని ఎలా ఎక్కించుకున్నావు? దింపేయి'' అన్నాడు- కంపెనీ రూల్స్‌ని విధేయతతో పాటించాలనే పట్టుదల ఉన్న వాడిలాగా.

"అరే-డ్రైవర్ చేసిన దాంట్లో తప్పేమి ఉంది? ఆ పసిపాప బస్‌లు లేక ఏడుస్తుంటే జాలిపడి ఎక్కించుకున్నాడు. అందుకు గాను తానేమీ డబ్బు తీసుకోలేదు. మీ బిడ్డే అటువంటి పరిస్థితిలో ఉంటే మీరేమి చేసేవారు?" అన్నాడు రెండో యూనియన్‌కి చెందిన ఒక సభ్యుడు. అతనికి పాప మీద సానుభూతి కంటే ప్రత్యర్థిని చిత్తు చేయాలనే కాంక్ష బలంగా ఉంది.

నా బిడ్డ సంగతి మీకెందుకు? రూలంటే రూలే."

"రూల్ అంటే మానవత్వాన్ని మరిచి పోవడం కాదు."

"మానవత్వం మాటయితే ఈ ఒక్క పాప విషయంలోనే కాదు- ఈ రోజు బస్‌లు లేవు కనుక ఇంకెందరోపిల్లలూ, ముసలివాళ్ళూ, స్త్రీలూ ఇలాగే బాధ పడుతూ ఉంటారు. దారిలో కనిపించిన అటువంటి వారందరినీ ఎక్కించుకుంటారా?"

"అలా ఎవరూ చేయరు. అయినా ఒక చిన్న పిల్లని ఎక్కించుకున్నందుకు ఏమిటీ రాద్ధాంతం?"

"రాద్ధాంతం అంటావా? మాటలు జాగ్రత్తగా రానీ"

"ఏం చేస్తావేమిటి?"

బస్‌లో మిగిలిన వాళ్ళు, ఇద్దర్నీ సర్ది కూచోబెట్టారు. పాపకి ఇదేమీ అర్థం కాక, అర్థం చేసుకోలేక, వాళ్ళ వంక వింతగా చూస్తూ కూర్చుంది. ఆ గొడవకి మూల కారణం తానేనని ఆ చిన్నారికి తెలియదు. తాను చేసిన మంచిపని ఈ విధంగా పరిణమించినందుకు మనసులో ఎంతో బాధపడ్డాడు డ్రైవర్. ఏమి జరగనుందో అదే జరుగుతుందిలే అనుకుని మౌనంగా ఉండిపోయి బస్‌ని నడుపుతున్నాడు.

తర్వాత స్టాప్‌లో, పోట్లాడుకున్న ఇద్దరు సభ్యులూ దిగిపోయారు. వాళ్ళు దిగిపోయినా కూడా, రెండు వర్గాలకి చెందిన సభ్యులు తమలో తాము ఈ విషయం మీద వాదోపవాదాలు చేసుకోసాగారు.

మాదన్నపేట స్టాప్ వచ్చింది. ఆ పాప బస్ దిగి డ్రైవర్‌కి థాంక్స్ చెప్పి వెళ్ళి పోయింది. ఆ చిన్నారి నోటంట థాంక్స్ వింటూంటే అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. ఆ ఆనందంలో బస్‌లో జరిగిన రాద్ధాంతాన్ని మరిచిపోయాడు డ్రైవర్.

* * *

రెండు రోజుల తర్వాత డ్రైవర్‌కి పర్సనల్ ఆఫీసర్ దగ్గర

నుంచి పిలుపు వచ్చింది. ఎప్పుడూ లేనిది ఈ పిలుపు ఏమిటా అని భయం భయంగా వెళ్ళాడు. ఆఫీసర్ గారి ముఖం గంభీరంగా ఉంది.

"డ్రైవర్ రామన్న నువ్వేనా?"

"అవును సార్!"

"అలా కూర్చో."

భయం భయంగా ఇబ్బందిగా కుర్చీలో కూర్చున్నాడు రామన్న.

"నీ మీద కంప్లైంట్ వచ్చింది."

"ఏ విషయంలో సార్?"

"నువ్వు మొన్న మన కంపెనీ బస్‌లో ఎవరో పబ్లిక్‌ని అనాథ రైడ్‌గా ఎక్కించుకున్నావటగా?"

"అవును సార్!"

"ఎవరా వ్యక్తి?"

"ఆరేళ్ళైనా లేని పసిపాప. ఆకస్మికంగా జరిగిన స్ట్రయిక్ మూలంగా బస్‌లు లేక, పేవ్‌మెంట్ మీద అల్లాడిపోతూ ఏడుస్తుంటే, ఆ దృశ్యం చూడలేక, జాలిపడి ఆ పాపని ఎక్కించుకున్నాను. నా బస్‌రూట్‌లోనే ఉన్న మాదన్నపేట బస్‌స్టాప్ దగర దింపేశాను. ఇదే నేను చేసిన నేరమైతే శిక్షించండి సార్!" కొంచెం ఆవేశంగా అన్నాడు రామన్న.

"మైగాడ్! ఇదంతా నాకు తెలీదే. కంప్లెయింట్‌లో మెంబర్

---

# విజయ

# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36రూ" |
| అర్ధసంవత్సర చందా | 18 రూ" |
| విడి ప్రతి | 3 రూ" |

అఫ్ పబ్లిక్‌ని అనాథరైజ్డ్‌గా ఎక్కించుకున్నావని వ్రాశారు. మిశ్చివస్ ఫెలోస్!" అన్నాడు ఆఫీసర్.

"మీరు అర్థం చేసుకున్నారు. అది చాలు నాకు. మీరు ఏ విధంగా నిర్ణయించినా అందుకు నేను బద్ధుడనే."

"రామన్నా! నువ్వు చేసింది మానవత్వంతో కూడుకున్న మంచి పని. అందుకు నిన్ను నేను వ్యక్తిగతంగా మనసారా అభినందిస్తున్నాను. కాని కాగితం మీద కంప్లెయింట్ వచ్చినప్పుడు, పర్సనల్ ఆఫీసర్‌గా దానిమీద నేను చర్య తీసుకోక తప్పదు. జరిగినదంతాను స్టేట్‌మెంట్ వ్రాసి ఇయ్యి" అన్నాడు ఆయన.

ఆఫీసర్‌గారు చెప్పినట్లు స్టేట్‌మెంట్ వ్రాసి ఇచ్చాడు రామన్న.

మరి వారంరోజులకి పర్సనల్ డిపార్ట్‌మెంట్ నుంచి రామన్నకి మెమో వచ్చింది. అందులో ఇలా వుంది-

"ఫలానా తారీఖున రామన్న తన రూట్ నంబర్ 44 బస్‌లో అనాథరైజ్డ్‌గా ఒక కంపెనీకి సంబంధించని వ్యక్తిని బస్‌లో తీసుకువెళ్ళినట్లు పిర్యాదు వచ్చింది. ఈ విషయన్ని రామన్న తన స్టేట్‌మెంట్‌లో ఒప్పుకున్నాడు కూడా. అయితే రామన్న తాను ఎక్కించుకున్నది కేవలం ఆరేళ్ళ పసిపాపని అనీ, బస్‌లు లేనందువల్ల ఆ పాప ఇంటికి వెళ్ళలేక భయపడి ఏడుస్తుంటే చూసి జాలిపడి ఎక్కించుకున్నట్లూ తెలియజేశాడు. ఈ విషయాన్ని బస్‌లో ప్రయాణం చేసిన మిగిలినవారు దృఢపరిచారు కూడా. పైగా రామన్న ఆ పాప దగ్గర నుంచి డబ్బేమీ తీసుకోనట్లు తెలిసింది. ఈ పరిస్థితిల్లో రామన్న చేసిన పనిని మానవతా దృక్పథంతో చేసిన చర్యగా భావించి అతనిమీద తీవ్ర చర్యనేమీ తీసుకోవడంలేదు. అయితే రూల్ ప్రకారం రామన్న చేసినది నేరమే. అందుకుగాను అతన్ని ఇంకముందు ఇటువంటి నేరాలు చేయకుండా వుండేటట్లుగా వార్నింగ్‌తో వదిలి వేయడమైనది." ❋

Published by K. Rajendra Babu, 80- Dhanalaxmi Colony, Madras 600 026, Printed by Vijaya Bapineedu at Vijaya Graphics; 210- Arcot Road, Madras- 600 026. Phone: 422233

Editor: VIJAYA BAPINEEDU